


కోలాటం జానపదుల వినోదాల్లో ఒకటి. స్త్రీల కోలాటం, పురుషుల కోలాటం అని రెండురకాలు. పురుషులు మూరెడు పొడవు కల్గిన కట్టెల్ని చేత పట్టుకొని గుండ్రాకారంగా తిరుగుతూ కోలాట మేస్తారు. స్త్రీలు నేలపై కూర్చొని చేతులతో చరుస్తూ కోలాట మేస్తారు. స్త్రీలు చెక్కల్ని చేతబట్టి 'జడ కోపు'ను రకరకాల అల్లికలో చూపిస్తారు. ప్రస్తుతం ఈ వ్యాసంలో నేలపై కూర్చొని చేతులతో వేసే కోలాటాన్ని మాత్రమే చర్చించటం జరుగుతుంది.

జానపద స్త్రీలు పనిపాటా ముగించుకొని రాత్రి సమయాల్లో కానీ, పండుగ పబ్బాల్లో కానీ, ఈ కోలాటమేస్తారు. సరిసంఖ్యలో పాల్గొంటారు. అందరూ గుండ్రాకారంగా 'చక్కామళ్ళు' (పద్మాసనం వేసుకొని కూర్చుంటారు. ఇద్దరిద్దరు రెండు చేతుల్ని వేళ్ళతో ఇరికించుకొని పట్టుకొంటారు. నాల్గు అరచేతులు కలిపేలా కొడతారు. పాటను ఎత్తుకొనే ముందుగా కొడతారు దీన్ని ఎత్తుగడ అంటారు. పాటకు ఒకరు పాడుతుండగా మిగిలిన వారంతా వంత పాడతారు. కోపును తెగ్గొట్టే సమయంలో ఈ గేయాన్ని పాడుతారు.

చింతపూత చింతపూత రాలంగ
చిలకాబొట్టు పెట్టంగ
దండమయ్య దండమయ్య నా మరది
దండద్దెచ్చె నా మరది
వాకు తోటకు పోతాడు
అరకట్టాకుల్ తెత్తాడు
సెర్లోపల్లికి పోతాడు
సేరొక్కలు తెత్తాడు.

పై పాదాలు అయిపోగానే చేతులు బరాబరా కొడతారు. అందరూ లయాత్మకంగా కొడుతున్నారో లేదో వారిలోనే ఒకరు కనిపెడుతూ వుంటారు. అందరూ ఒకేసారి కొట్టటం వినిపించిన వెంటనే ఇంకో పాటకు ఎత్తుకొంటారు.

కుండడు కూడొండినదాన
కుక్కల నక్కల కేసినదాన
బానడు కూడొండినదాన
బావమరదుల కేసినదాన
చిక్కుతీసిన సినడోల్లి
రాయాపోదామూ

అంటూ అరిచేతుల్ని విడిపించుకొని కుడిఎడమల ప్రక్కవుండే జతలకు ఒక్కొక్కసారి చప్పట్లు అందిస్తారు. ఇవి కుడిప్రక్క ఒక్కసారి (అందరూ ఒకేసారిగా) ఎడమ ప్రక్క ఒకేసారి అందిస్తూ వుండగా లయాత్మకంగా కొట్టటం వినిపించగానే ఇలా పాడుతారు.

కోలికోలి కొమ్మలాట
మేడమింద బొమ్మలాట
మీ మొగుల్లంత దండుపోయిరి
మీరు పొండి మిడతల్లారా
నాలుగండ్ల నట్టనడుమ
నాగలయ్యను నేను గంటి
నాగలోకము నేనే బోతిని.

ఇలాంటి గేయాలు పాడుకొన్న తర్వాత చివరగా కొంత ఇతివృత్తమున్న గేయం పాడుతారు. ప్రతిపాదంలోను మొదటా చివరగా 'కోయిలో కొమ్మ నెరుడో' అనే ఊత పదంతో గేయాని కొక తూగు, కోలాటాని కొక ఊపు నిస్తుంది. జానపద గేయాల్లో ఊతపదాలు ఎక్కువగా వుంటాయి. వాటిలో ఉయ్యాలో - గురిగింజగురిమల్లెలో - చందమామ యెన్ని లాయిలో - రాక నా సందనులో మొ॥ ఊతపదాలుంటాయి. ఒక్కొక్క పాదాన్ని పాడుతుండగా మిగిలిన వారంతా వంత పాడుతారు.

కోయిలో కొమ్మనేరుడో మా నాన్న వత్తాడు
మరవరామంద కోయిలో కొమ్మ నేరేడు
,, మీ నాన్న వత్తేను మామేకావల్ల ,,
,, మాయమ్మ వత్తుంది మరపరకుండ ,,
,, మీయమ్మ వత్తేను నా కత్తకావల్లే ,,
,, మాయన్న వత్తాడు మరపరమంద ,,
,, మీయన్న వత్తేను బావ కావల్లే ,,
,, మా వదిన వత్తోంది మరపరమంద ,,
,, మీ వదిన వత్తేను నాకక్కకావల్లే ,,
,, మా బావ వత్తాడు మరపరామంద ,,
,, మీ బావ వత్తేను నా కన్నకావల్లే ,,
,, నా తమ్ముడొత్తాడు మరపరామంద ,,
,, నీ తమ్ముడొత్తేను బామరదికావల్లే ,,
,, నా సెల్లిలొత్తుంది మరపరామంద ,,
,, నీ సెల్లిలొత్తేనునాకిమరదలుకావల్లే ,,
,, నేనైన వత్తాను మరపరామంద ,,
,, నీవైన వత్తేను భార్యవే కావల్లే ,,

పై పాటలు సుమారు 15 వరకు సేకరించాను. స్త్రీ నృత్యాలు గొబ్బి నృత్యం, చెమ్మచెక్క చిన్ని చిన్నక్క, నృత్యం పెళ్ళి నృత్యం మొ॥ సేకరించాను. అసలు ఈ జానపద నృత్యాలు ఆదిమజాతి నృత్యాల ద్వారా పుట్టాయని శాస్త్రీయ నృత్యాలు జానపద నృత్యాలద్వారా పుట్టాయని ప్రొజిన్ బెనర్జి తెలిపారు. ఇతను జానపద నృత్యాన్ని గూర్చి వివరిస్తూ—

"Unlike classical dance, folk dance was made for the sheer pleasure of the performers and not for the entertainment of the public while the primitive and aboriginal dancing was nothing but a spontaneous and emotional rhythmic expression preparatory to a riual or battle— nevertheless primitive dance was the foundation of folk dance, and folk dance was the foundation of the refined form." (Folk Dances of India]

ఇలాంటి జానపద నృత్యాలు ఎన్నో మరుగున పడ్డాయి. వాటిని వెదికి తీయడం అందరిమీద ఆధారపడి వుంది. తెలుగు జాతి సంస్కృతిని ప్రతిబింబించే ఈ నృత్యాలు ఒకచోట చేర్చటం,మనకర్తవ్యం. ఆదరణలేక అడుగంటి పోతున్నాయి. ఇలాంటి జానపదనృత్యసాహిత్యాన్ని వెలికి తీయటం మనందరి కర్తవ్యం.

— శ్రీ చిగిచెర్ల కృష్ణారెడ్డి